క్లుప్తంగా

నేడు హుండీ లెక్కింపు

కనగల్ : మండల పరిధిలోని దర్వేశిపురం శ్రీ రేణుక ఎల్లమ్మ దేవస్థాన హుండీ లెక్కింపును శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చేదేటి వెంకట్‌రెడ్డి, ఈఓ అంబటి నాగిరెడ్డిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆలయ సిబ్బంది సకాలంలో హాజరుకావాలని కోరారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు

నల్లగొండ : రెడ్డి ఫౌండేషన్ గ్రో ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ నిర్వాహకులు అల్మాస్ ఫర్హీన్ ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ ఆపరేషన్, కమ్యూనికేషన్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, సాఫ్ట్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైపింగ్, సెక్టర్ రీడ్‌నెస్, ఇంటర్వ్యూ స్కిల్స్ అంశాలపై రెండు నెలల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత 10 తరగతి, ఇంటర్, డిగ్రీ, పాస్ లేదా ఫెయిల్ అయిన వారు, 18ఏళ్ల నుంచి 30ఏళ్ల లోపు నిరుద్యోగులు సెప్టెంబర్ 15వ తేదీలోగా నల్లగొండలోని గడియారం సెంటర్‌లని కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 70326 49925, 91777 85983 సంప్రదించాలని కోరారు.

గుర్తింపు విద్యార్థి సంఘాన్ని రద్దు చేయడం దారుణం

నల్లగొండ టూటౌన్ : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ గుర్తింపు విద్యార్థి సంఘాన్ని రద్దు చేయడం రాజ్యాంగ విరుద్ధమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ గుర్తింపు విద్యార్థి సంఘం పదవీ కాలం పూర్తికాక ముందే పక్షపాత ధోరణితో రద్దు చేయడం దుర్మార్గపు చర్య అని తెలిపారు. క్యాంపస్ వైస్ ఛాన్స్‌లర్ రాజకీయ దురుద్దేశంతో వ్యవహరిస్తూ రద్దు నిర్ణయం తీసుకున్నాడని ఆరోపించారు. రద్దు నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రైతులకు అవగాహన కల్పించాలి

మునుగోడు : పంటల దిగుబడికి రైతులు వినియోగిస్తున్న ఎరువులపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని గ్లోబల్ అగ్రి ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఫార్మర్ వ్యవస్థాపక అధ్యక్షుడు నెల్లికంటి రాఘవేంద్ర యాదవ్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎప్పుడులేని విధంగా ఈ ఏడాది పత్తి పంటకు ఎర్రతెగుళ్లు రావడంతో పంట దిగుబడి బాగ పడిపోయ్యే ప్రమాదం ఉందన్నారు. తెగుళ్లు రావడానికి రైతులు అధికంగా ఎరువులు వినియోగించడం లేదా యూరియా సరిపడా వినియోగించకపోవడమెనని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారన్నారు. అలాంటి రైతులకు అవగాహన కల్పించాల్సిన ఎంతైన ఉందన్నారు.

విద్యార్థులకు స్కూల్‌బ్యాగుల పంపిణీ

కనగల్ : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలోని 20మంది పేద విద్యార్థులకు గురువారం స్కూల్ బ్యాగ్ కిట్లను ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్‌ను యూత్ ఫర్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సృజనాకుమారి, ఉపాధ్యాయులు ఆరూరి జానయ్య, శ్రీరాములు, కర్ణకర్, మాధవిలత, అరుణ, కవిత, సైదులు, తిరుపతి, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలి

మర్రిగూడ : ప్రభుత్వం ప్రజలకు ప్రతినెలా పంపిణీ చేసే రేషన్ బియ్యం పాడైపోతే అట్టి బియ్యాన్ని డీలర్లు వెంటనే పౌర సరఫరాల సంస్థ గోదాంకు పంపి వాటికి బదులుగా నాణ్యమైన బియ్యాన్ని తీసుకొచ్చి ప్రజలకు పంపిణీ చేయాలని పౌర సరఫరాలశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని వట్టిపల్లి రేషన్ దుకాణాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించి బియ్యాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రజలకు మెరుగైన సన్న బియ్యాన్ని పంపిణీ చేయాలని రేషన్ డీలర్లకు సూచించారు. డీలర్లు కార్డుదారుల వద్ద బియ్యాన్ని కొనవద్దని హెచ్చరించారు. బియ్యానికి బదులు కార్డుదారులకు డబ్బులు ఇస్తే డీలర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట రేషన్ డీలర్లు ఉన్నారు.

మూసీకి తగ్గిన ఇన్‌ఫ్లో

- ప్రాజెక్ట్ గేట్లు మూసివేత

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదనీరు తగ్గుముఖం పట్టడంతో గురువారం ప్రాజెక్టు అధికారులు దిగువ మూసీకి నీటి విడుదలను పూర్తిగా నిలిపివేశారు. మూసీ ప్రాజెక్టుకు కేవలం 693 క్యూసెక్కుల వరదనీరు వచ్చింది. 645 అడుగుల గరిష్ఠ నీటిమట్టం గల మూసీ ప్రాజెక్టులో సాయంత్రం వరకు నీటిమట్టం 643.50 అడుగుల వద్ద ఉంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో గత 45 రోజుల నుంచి తెరిచి ఉంచిన క్రస్టు గేట్లను అధికారులు పూర్తిగా మూసి వేశారు. ఆయకట్టులో పంటల సాగుకు ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు 573 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు..

రజాకార్లను ఎదిరించిన వల్లాల

- నిజాం వ్యతిరేక పోరాటంలో అసువులు బాసిన పదిమంది వీరులు
- నేడు వల్లాలలో అమరవీరుల స్థూపం ఆవిష్కరణ, బహిరంగ సభ
- సభకు హాజరుకానున్న పీసీసీ అధ్యక్షుడు, మంత్రులు



అమరుల ప్రాంగణంలో నివాళులర్పిస్తున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు (ఫైల్)



వల్లాల జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఆవిష్కరణకు సిద్ధమైన అమరవీరుల స్మారకస్థూపం

శాలిగౌరారం : నిజాం వ్యతిరేక పోరాటంలో జిల్లాలోని శాలిగౌరారం మండలం వల్లాలది ప్రత్యేక స్థానం. ఆనాడు దేశానికి బ్రిటీష్ పాలననుంచి విముక్తి లభించి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చినా నిజాం పాలనలో ఉన్న సంస్థానాలకు మాత్రం స్వాతంత్ర్యం రాలేదు. దీంతో నిజాం పాలనకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టుల నాయకత్వంలో సాయుధ పోరాటం సాగింది. ఈ పోరాటంలో గ్రామానికి చెందిన పది మంది అసువులు బాసారు. ఈ సంఘటన వివరాలు తెలుసుకున్న పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు రెండు సంవత్సరాల క్రితం వల్లాలకు వచ్చి అమరవీరులకు నివాళులు అర్పించారు. అమరవీరుల స్మారకార్థం తన సొంత ఖర్చులతో వల్లాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో చేపట్టిన స్మారక స్థూపం నిర్మాణం పూర్తయింది. శుక్రవారం స్థూపావిష్కరణ చేయనున్నారు. అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నారు.

వల్లాల చరిత్ర ఇదీ..

నిజాం వ్యతిరేక పోరాటంలో భాగంగా వల్లాల గ్రామంలో మహిళలపై రజాకార్లు జరుపుతున్న అకృత్యాలను చూసి తట్టుకోలేక రహస్య ప్రదేశంలో ఉన్న గ్రామానికి చెందిన యుక్త వయస్సులో ఉన్న ఏడుగురు తిరుగుబాటుదారులు గద్దపాటి లచ్చయ్య, గుండ్లపల్లి రామయ్య అలియాస్ సేక్సింది రామయ్య, గుండ్లపల్లి మల్లయ్య అలియాస్ బుడింగ మల్లయ్య, గుండ్లపల్లి రామయ్య అలియాస్ తిమ్మిరి రామయ్య, చిట్టిప్రోలు శ్రీరంగం, గద్దపాటి బుచ్చయ్య అలియాస్ దుబ్బ బుచ్చయ్య, అనుముల శ్రీహరి 1948 సెప్టెంబర్ 16న గ్రామంలోకి ప్రవేశించి గ్రామం నడిబొడ్డులో మువ్వన్నెల జాతీయజెండాను ఎగురవేశారు. ఈ సమాచారాన్ని గ్రామానికి చెందిన షేక్ మదార్ రజాకార్లకు చేరవేశాడు. దీంతో గ్రామంలోకి ప్రవేశించిన నిజాం రజాకార్లతో పలువురు తిరుగుబాటుదారులు పోరాడి వారి చేతుల్లో ఉన్న తుపాకులను లాక్కొనే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రజాకార్లు ఏడుగురు తిరుగుబాటుదారులను పట్టుకొని నాడు నిజాం నవాబు నిర్మించిన రెండు గదుల పాఠశాల (నేటి జడ్పీ ఉన్నత పాఠశాల) ఆవరణలో ఉన్న మర్రిచెట్టుకు కట్టేసి కాల్చిచంపారు. వారి మృతదేహాలను పాఠశాల ఆవరణలోనే ఉన్న ఒక గుడిసెలో వేసి నిప్పుపెట్టి కాల్చి బూడిద చేశారు. 1948 సెప్టెంబర్ 17న గ్రామంలో మరో ముగ్గురు తిరుగుబాటుదారులు గద్దపాటి వెంకయ్య, గున్నాల రామయ్య, ఊట్కూరు గ్రామానికి చెందిన వ్యక్తిని రజాకార్లు పట్టుకొని కాల్చిచంపారు.

రజాకార్లకు ఎదురునిలిచిన ఖాదర్

వల్లా గ్రామానికి చెందిన మహ్మద్ ఖాదర్ ధైర్యంతో ముందుకు వచ్చి ఎంతమందిని కాల్చి చంపుతారు.. ముందు నన్ను కాల్చి చంపండిరా.. అంటూ గట్టిగా అరవడంతో ఖాదర్ మాటలు విన్న గ్రామస్తులు ధైర్యంగా ఇళ్లనుంచి బయటకు వచ్చి రజాకార్లకు ఎదురుతిరిగారు. దీంతో రజాకార్లు గ్రామంనుంచి వెళ్ళిపోయారు. సెప్టెంబర్ 18న గ్రామానికి మిలటరీ సైన్యం వచ్చిందని, అప్పుడే నిజాం నవాబు దేశ సైన్యానికి లొంగిపోయాడని, నిజాం పాలన నుండి విముక్తి కలిగిందని తెలిసినట్లు గ్రామానికి చెందిన నాటి పూర్వీకులు తెలిపారు.

సభను విజయవంతం చేయాలి

వల్లాల గ్రామంలో శుక్రవారం జరుగనున్న అమరవీరుల స్మారకస్థూపావిష్కరణ, బహిరంగసభను విజయవంతం చేయాలని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హన్మంతరావు, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ కోరారు. అమరవీరుల స్మారక స్థూపం ఆవిష్కరణ ఏర్పాట్లను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. అమరవీరుల స్థూప ఆవిష్కరణ కార్యక్రమానికి పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అడ్లూరు లక్ష్మణ్, రాష్ట్ర మంత్రులు నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, హోంశాఖ మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, మార్కెట్ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ నరిగె నర్సింహ, నాయకులు అన్నెబోయిన సుధాకర్ షేక్ ఇంతియాజ్, దండ అశోక్‌రెడ్డి, భూపతి వెంకటేశ్వర్లు, పదాల రమేశ్, సుల్తాన్ యల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

హైఓల్టేజీతో విద్యుత్ గృహోపకరణాలు దగ్ధం



విద్యుత్ ఎస్ఈ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చిట్యాల : మున్సిపాలిటీలోని పదో వార్డులో గురువారం సాయంత్రం ఇళ్లలోకి హై ఓల్టేజీ విద్యుత్ ప్రసారం అయింది. దీంతో పలువురు ఇళ్లలోని టీవీలు, ఫ్యాన్లు, విద్యుత్ లైట్స్, ల్యాప్‌టాప్‌లు, ఫ్రిజ్‌లు, ఏడాప్టర్‌లు దగ్ధమయ్యాయి. దీంతో విద్యుత్ వినియోగదారులకు వేలాది రూపాయల నష్టం వాటిల్లింది. ఇటీవల కాలంలో పదో వార్డులో విద్యుత్ సరఫరాలో ఓల్టేజీ, హైఓల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రాలను అందజేసినా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులను తొలగించేందుకుగాను అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయినప్పటికీ వాటికి విద్యుత్ కనెక్షన్లు ఇవ్వకపోవడంతో వార్డు ప్రజలు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే తగిన చర్యలు తీసుకొని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు ప్రజలు అధికారులను కోరుతున్నారు.

ఎస్ఈకి వినతి పత్రం అందజేత..

చిట్యాల మున్సిపాలిటీలో నెలకొన్న విద్యుత్ సరఫరాలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు గురువారం నల్లగొండలో విద్యుత్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లుకు వినతి పత్రాన్ని అందజేశారు. పలు వార్డులో నెలకొన్న లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని, చిట్యాల మున్సిపాలిటీలో నిరంతరాయంగా ఆటంకాలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని వారు వినతి పత్రంలో కోరారు. ఇప్పటికే బిగించిన అదనపు ట్రాన్స్‌ఫార్మర్లకు విద్యుత్ సరఫరా కనెక్షన్లు చేయాలని వారు ఎస్ఈని కోరారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో ఆ పార్టీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, నాయకులు జయారపు రామక్రిష్ణ ఉన్నారు.

సైన్స్ సెమినార్‌లో సత్తా చాటిన విద్యార్థిని



అక్షరకు మెమొంటో అందిస్తున్న జ్యూరీ, ఎంఈఓ

చండూరు : సైన్స్ సెమినార్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని సత్తా చాటింది. గురువారం మండల పరిధిలోని బోడంగిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని ఏ.అక్షర క్వాంటం యుగం–అనుకూలతలు సవాళ్లు అనే అంశంపై జిల్లా స్థాయిలో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో పాల్గొని ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సెమినార్ జ్యూరీ సభ్యులుగా ఎన్‌జీ కళాశాల ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సైన్స్ ఆర్గనైజర్ లక్ష్మీపతి, గైడ్ ఉపాధ్యాయులు శంకర్‌రెడ్డి లు వ్యవహరించారు. ఈ సందర్భంగా జ్యూరీ విద్యార్థిని అక్షరను మెమొంటో సత్కరించారు. ఈకార్యక్రమంలో చండూరు ఎంఈఓ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలి

కేతేపల్లి : ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కేతేపల్లి ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఇనుపాముల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను దశలవారిగా పూర్తి చేసిన వెంటనే ఫొటోలు ఆన్‌లైన్ అప్లోడ్ చేసి లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. మండలానికి 469ఇళ్లు మంజూరు కాగా 196 ఇళ్లు బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తయ్యాయని, వాటిలో 112 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయ్యాయని పేర్కొన్నారు. ఇంకా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ కార్యదర్శి సైదులు తదితరులు ఉన్నారు.



ఇనుపాములలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

గ్రూప్1 పరీక్షను వెంటనే తిరిగి నిర్వహించాలి

మర్రిగూడ : తెలంగాణాలో గ్రూప్1 పరీక్షను ప్రభుత్వం వెంటనే తిరిగి సక్రమంగా నిర్వహించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చెరుకు లింగంగౌడ్ అన్నారు. గురువారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని అమలు చేయడంలో విఫలమైందన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ఇంతవరకు ప్రకటించలేదని, నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, టీజీపీఎస్సీ పరీక్షలను సైతం సక్రమంగా నిర్వహించకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం గ్రూప్1 పరీక్షలో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టి తిరిగి పరీక్షను సమర్ధవంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ఎర్రకాల్వకు మరమ్మతులు చేపట్టిన రైతులు



ఎర్రకాల్వకు మరమ్మతులు చేయిస్తున్న రైతులు

నార్కట్‌పల్లి : యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి నుంచి నార్కట్ పల్లి మండలం నెమ్మాని గ్రామం వరకు ఉన్న ఎర్ర కాల్వ(వరద కాల్వ)కు గురువారం రైతులే స్వయంగా మరమ్మతులుచేపట్టారు. సంబంధిత అధికారులు సరైన మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు సొంత ఖర్చుతో జేసీబీ సాయంతో మరమ్మతులు చేపట్టారు. వరద కాల్వ ఆక్రమణకు గురికాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాల్వ నీరు నెమ్మాని వరకు రాకుండా రైతులు అడ్డుగా మట్టి పోసినట్లు తెలిపారు.సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాల్వ ఆక్రమణకు గురవుతుందని తెలిపారు. తొండల్వాయి మాజీ ఎంపీటీసీ బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బైరెడ్డి పురుషోత్తంరెడ్డి, గంట వెంకట్‌రెడ్డి, సంద్యాల మధుసూదన్‌రెడ్డి, బైరెడ్డి శైలందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు, కొండల్‌రెడ్డి, ఉన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ ఉపేందర్

రామగిరి(నల్లగొండ) : ఎంజీ యూనివర్సిటీలో జరుగుతున్న అంతర్ కళాశాలల క్రీడా పోటీల్లో ఎన్జీ కళాశాలకు చెందిన విద్యార్థుల ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కళాశాలకు చెందిన క్రీడాకారులు కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ గురువారం క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నర్సింగ్ కోటయ్య, డాక్టర్ బొజ్జ అనిల్, డాక్టర్ అంకష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1 పరీక్ష అవినీతిపై విచారణ జరిపించాలి

రామగిరి(నల్లగొండ): గ్రూప్ 1 పరీక్షలో జరిగిన అవినీతి అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గురువారం నిరుద్యోగులలతో కలిసి మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాయ చెబుతూ నిరుద్యోగులను దగా చేస్తుందన్నారు. పరీక్షల్లో అక్రమాలు జరిగాయని హైకోర్టు చెప్పినా ప్రభుత్వం ఎలాంటి స్పందన లేదన్నారు. గ్రూప్ 1 పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయ్, నోముల క్రాంతి, కిరణ్‌కుమార్, వెంకట్, కృష్ణ, శ్రీకాంత్, రమేష్, యుగేందర్, నగేష్, లింగస్వామి, శ్రీశైలం, వర్షిత, రేణుక, అంజలి, శ్రీదేవి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులు సజావుగా జరిగేలా చూడాలి

- డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి



నకిరేకల్‌లో : నగదురహిత చెల్లింపుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శేఖర్‌రెడ్డి

నకిరేకల్ : మండల సమాఖ్యలో డిజిటల్ చెల్లింపులు సజావుగా జరిగేలా సమాఖ్య ప్రతినిధులు, వీఓలు చూడాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. నగదు రహిత లావాదేవీల నిర్వహణ కోసం పైలట్ ప్రాజెక్టు కింద నకిరేకల్ మండలాన్ని మోడల్ మండలంగా ఎంపికైంది. ఈ నేపథ్యంలో మండల సమాఖ్య ప్రతినిధులు, సిబ్బందికి మండలకేంద్రంలో శుక్రవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నగదు రహిత లావాదేవీలపై అవగాహన కల్పించారు. సమాఖ్యలోని సభ్యురాలు ఏ ఫోన్ నుండైనా గుగూల్ పే, ఫోన్ పేల ద్వారా రూ.5వేల నుంచి రూ.లక్ష వరకు లావాదేవీలు జరుపవచ్చన్నారు. నగదురహిత లావాదేవీలపై సమభావన సంఘాలకు అవగాహన కల్పించి బ్యాంక్ అనుసంధానంతో డిజిటల్ చెల్లింపులు జరిగేలా చూడాలన్నారు. అందుకోసం గ్రామసంఘాలకు అవగాహన, శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీపీఎం సోమయ్య, ఏపీఎం ప్రభాకర్, మండల సమాఖ్య అధ్యక్షురాలు సరిత, డీఎంజీ నర్సయ్య, సీసీలు పద్మ, బాలు, వెంకన్న, శంకర్, వీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలి



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

రామగిరి(నల్లగొండ) : గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం మండలంలోని రాములబండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఏఎన్‌సీ కేసులు, కుక్క కాటుకు యాంటి రేబిస్ వ్యాక్సినేషన్, మెడిసిన్, మలేరియా, డెంగీ పరీక్షల వివరాలు పరిశీలించారు. అనంతరం అప్పాజీపేటలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. వేణుగోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



గుత్తా అమిత్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌కుమార్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో అంతటి నాగరాజు, అంతటి నరేష్, వెలిమినేటి లింగారెడ్డి, మర్రి రాములు, మర్రి శంకరయ్య, జనపాల స్వామి, కురుపటి ఊషయ్య, వడ్డెపల్లి నర్సింహ్మ, బోడ్డు యాదయ్య, బోడ్డు రాములతో పాటు మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెరుకు సైదులు, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, పల్లపు బుద్ధుడు, ఉయ్యాల లింగయ్య, జనపాల శ్రీను, కురుపటి లింగయ్య, పాకాల దినేష్, బోయస్వామి పాల్గొన్నారు.

సాయుధ పోరాటాన్ని మతాలకు ఆపాదించొద్దు



చిట్యాల: గుండ్రాంపల్లిలో జెండా ఎగురవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చిట్యాల : నిజాం పాలకులకు, రజాకార్లకు వ్యతిరేకంగా చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని ప్రస్తుతం కొన్ని పార్టీలు మతాలకు ఆపాదించడం సరికాదని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయుధ రైతాంగ మృతవీరుల స్మారక స్థూపం వద్ద ఆయన నివాళులర్పించారు. అనంతరం ఆయన సీపీఐ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయుధ రైతాంగ పోరాటంలో అన్ని వర్గాలు, మతాలకు చెందిన ప్రజలు పాల్గొన్నారని ఆయన గుర్తు చేశారు. సాయుధ పోరాటం పాల్గొన్న అమరవీరుల కుటుంబాలను ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గుర్తించకుండా రాజకీయాలకు మాత్రం సాయుధ పోరాటాన్ని వాడుకుంటూ మతం రంగును పులుముతుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్, గీతా పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బోడిగె సైదులు, ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య, మండల కార్యదర్శులు ఎం.డిఅక్బర్, చాల శ్రీనివాస్, నల్పరాజు సతీష్, గ్రామ కార్యదర్శి జిల్లా సత్యం, సహాయ కార్యదర్శి కేతరాజు అంజయ్య, సీమ అంజయ్య, జిల్లా యాదయ్య, బోడిగె బక్క శెట్టి, జిల్లా లక్ష్మయ్య, ముదిగొండ మురళి, కృష్ణ, వెంకటేష్, లింగస్వామి, వసంత, పాల్గొన్నారు.

గ్రామాల్లో మంచి పాలనను అందించాలి

నాంపల్లి : గ్రామాల్లో మంచి పాలనను అందించాలని చండూర్ ఆర్డీఓ శ్రీదేవి అన్నారు. నాంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో ఉన్న 8క్లస్టర్లకు 8మంది గ్రామ పాలన అధికారులు రావడంతో వారికి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కొరకు దరఖాస్తులను పరిశీలించి వెంటనే అమలు చేయాలని తెలిపారు. మండలంలో నిషేధిత భూముల విషయంలో పలు జాగ్రత్తలు పట్టించాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ దేవసింగ్, ఆర్ఐ, జీపీఓలు ఉన్నారు.

దేవాలయ ప్రహరీ నిర్మాణానికి విరాళం



దాత లక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు

నకిరేకల్ : మండలంలోని చందుపట్ల గ్రామంలో పురాతన లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం ప్రహరీ నిర్మాణానికి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న గ్రామానికి చెందిన కందిమల్ల లక్ష్మారెడ్డి రూ.6లక్షలు అందజేశారు. గురువారం ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దాత లక్ష్మారెడ్డిని అలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మంగినపల్లి వెంకటయ్య, సీతారామచంద్రస్వామి దేవాలయ చైర్మన్ కిషన్‌రావు, ప్రతినిధులు చొగోని రామాంజనేయులు, శ్రీనివాసరెడ్డి, సంజీవరెడ్డి, మాజీ ఎంపీటీసీ లక్ష్మివెంకన్న, వెంకటేశ్, వెంకటేశ్వర్లు, రంగారెడ్డి, డాకయ్య, శ్రీనివాసులు, రమేశ్, లక్ష్మీనారాయణ, యాదగిరి పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

నాంపల్లి : పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయుల పాత్ర చాలా కీలకమని ముష్టిపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మునగాల శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం మండలంలోని ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన తెలుగు కాంప్లెక్స్ సమావేశంలో అయన మాట్లాడారు. విద్యార్థి జీవితం మాతృభాషతోనే ప్రారంభమవుతుందని ఆభాషను సులభతరం చేసి విద్యార్థికి అందించే గురుతర బాధ్యత తెలుగు ఉపాధ్యాయులదేనని తెలిపారు. ఇటీవల ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన తెలుగు ఉపాధ్యాయులు బి వెంకటేశం, నల్ల నర్సింహ్మ, నరసింహాచార్యులకు శాలువాతో సన్మానం చేశారు. ఈ సమావేశంలో ఆర్పీలు బిరుదోజు దామోదరాచారి, కృష్ణారెడ్డి, నాంపల్లి, మర్రిగూడెం, చింతపల్లి, గట్టుప్పల, మండలల్లో ప్రాథమికోన్నత, ఉన్నతమోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల తెలుగు ఉపాద్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు, జూనియర్ లెక్చరర్ సంఘం నాయకులు

నార్కట్‌పల్లి : రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత నార్కట్‌పల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బాలాజీని గురువారం లెక్చరర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఇస్మాయిల్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్య బోధించడంతో పాటు క్రమ శిక్షణ నిస్వార్థంతో విధులు నిర్వర్తించిన ప్రతి ఒక్కరికి అవార్డు దక్కుతుందని, అందులో బాలాజీకి అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ ఉస్మాన్ ఫౌండేషన్ చైర్మన్ మహమ్మద్ ఇస్మాయిల్, జి.ఎస్‌రావు ట్రస్ట్ చైర్మన్ జి.కవిత, సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శి రవీంద్రనాయక్, ఖమర్ సుల్తానా, కాలేజి సిబ్బంది శంకర్‌రావు, మహేష్, మమత, సాంబయ్య, నడింపల్లి వెంకటేశ్వర్లు, అంజిబాబు, వెంకటేష్, తేజస్విని, ఆస్మా, విద్యార్థులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదు

నకిరేకల్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుంటే రానున్న ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ అనుబంధ సంఘాల జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సామాజిక పెన్షన్‌ను పెంచుతామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి అధికారం చేపట్టి రెండేళ్లు కావొస్తున్నా హామీని నిలబెట్టుకోలేక పోతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చి మేలు చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేశ్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.